# బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. కూకట్‌పల్లిలోని శేషాద్రినగర్‌లో సోమవారం నిర్వహించిన కూకట్‌పల్లి డివిజన్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్ సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, ప్రజలు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కేంద్రం నుంచి భారీగా నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేసే అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఇన్‌చార్జి సుభాష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కార్పొరేటర్లు, డివిజన్‌ల అధ్యక్షులతో సమావేశం

కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు బాధ్యతను కార్పొరేటర్లు, డివిజన్‌ల అధ్యక్షులు భుజానికెత్తుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామనవమి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

కూకట్‌పల్లిలోని పురాతన రామాలయంలో ఈ నెల 17న నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే కృష్ణారావు సోమవారం సమీక్షించారు. ఆలయంలో కమిటీ నిర్వాహకులు, అర్చకులు, అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సూచనలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు..



కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావులకు కండువా కప్పుతున్న ఈటల రాజేందర్

## మల్కాజ్‌గిరి అభివృద్ధికి కట్టుబడి ఉంటా

**నిజాంపేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** మల్కాజ్‌గిరి అభివృద్ధికి కట్టుబడి ఉంటానని మాజీ మంత్రి మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి హరితవనం కాలనీలో జరిగిన సభలో 1వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. వీరికి ఈటల రాజేందర్ బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ 6 గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మళ్లీ కేంద్రంలో బీజేపీనే అధికారంలోకి వస్తుందని, నరేంద్రమోడి నాయకత్వంలో మల్కాజ్‌గిరిని అభివృద్ధి చేస్తానని అన్నారు. రాష్ట్ర కార్యదర్శులు మాదవి, జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భరత్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**మియాపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** బూత్‌కమిటీ సభ్యులందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, చేవెళ్ల లోక్‌సభ ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మియాపూర్ నరేన్ గార్డెన్‌లో బూత్ కమిటీ సభ్యులు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంతర్‌రెడ్డి అమలు చేసుకుంటూ వస్తున్నారని తెలిపారు. రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరికలు

**నిజాంపేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** నిజాంపేట్ 16వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ మహిళలు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. విష్ణు, శంకర్, మహేందర్, విక్రమ్ అనిత తదితరులు పాల్గొన్నారు.

**వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** వివేకానందనగర్ డివిజన్ పరిధి రామకృష్ణనగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివరాత్రి రవికుమార్, భారతమ్మ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.



రంజిత్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు రవికుమార్, భారతమ్మ

**హైదరనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** హైదరనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 300 మంది చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి రంజిత్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్ పార్టీలోకి ఆహ్వానించారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

## దైవ చింతనతో మానసిక ప్రశాంతత

**నిజాంపేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కౌసల్య కాలనీలో కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్, ఆగం పాండు ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో సీతా రామాంజనేయ శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర, శివపంచాయాతన, లలితా పరమేశ్వరి నవగ్రహప్రతిష్ట, వేంకటశివ రామాలయ ప్రతిష్ట, మహాకుంభాభి షేక మహోత్సవంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాలాజీ నాయక్, కో-ఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్‌రెడ్డి, నాయకులు చంద్రగిరి సతీష్, సాంబ శివారెడ్డి పాల్గొన్నారు.

## దళిత సంఘ సభ్యులకు సేవా రత్న అవార్డులు

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేద దళితులకు ఆర్థికంగా తోడ్పాటును అందించేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 12 వందల మంది దళితబంధు లబ్ధిదారులను ఎంపిక చేశామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. డాక్టర్ బాబాసాహేబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నియోజకవర్గంలో విజయవంతం చేసిన దళిత సంఘ ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సేవా రత్న అవార్డులను ఆయన నివాసంలో ప్రదానం చేశారు. కార్యక్రమంలో భూదాల విజయభాస్కర్, అశోక్, జేజే రత్నం, సత్యనారాయణ, శ్యామ్, రవి కృష్ణ, భిక్షపతి పాల్గొన్నారు.



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

## బీఆర్ఎస్ ప్రచార రథాలు ప్రారంభం

**వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. సప్తగిరికాలనీలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ ప్రచార రథాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగారావు, శ్రీనివాస్ యాదవ్, భిక్షపతి, సంతోష్‌రావు, కాశీనాథ్‌యాదవ్, శ్రీనివాస్, రాజేష్, చంద్ర, రాము, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులు, సిబ్బంది గృహ సముదాయానికి భూమిపూజ

**మియాపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** హఫీజ్‌పేట డివిజన్ ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులకు, సిబ్బందికి వసతి గృహ సముదాయానికి సోమవారం ఎమ్మెల్యే గాంధీ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు క్రిష్ణారెడ్డి, యాదయ్య, వెంగల్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండా సంగీతారెడ్డి

## ప్రజలంతా బీజేపీ వెంటే ఉన్నారు

**మియాపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** ప్రజలు బీజేపీ, నరేంద్రమోదీ వెంటే ఉన్నారని చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి సతీమణి సంగీతారెడ్డి అన్నారు. సోమవారం ఆమె హఫీజ్‌పేట డివిజన్‌లోని మైహోం జ్యూవెల్, కల్కి హైట్స్ గేటెడ్ కమ్యూనిటీలో తన భర్త విశ్వేశ్వరరెడ్డి తరుపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందరికి అందుబాటులో ఉండే విశ్వేశ్వరరెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం

**గచ్చిబౌలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జీ రవికుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం కొండాపూర్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను తూచ తప్పకుండా పాటించే సత్తా మోదీకి మాత్రమే ఉందన్నారు. 2047నాటికి వికసిత్ భారత్ బీజేపీ లక్ష్యమన్నారు.



అధికారులతో సమావేశమైన జెడ్సీ అభిలాష అభినవ్

## చెరువుల పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలి

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి జోన్ పరిధిలోని చెరువుల పరిరక్షణకు సంబంధిత అన్నీ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో సోమవారం ఆమె ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, రెవిన్యూ విభాగాలకు చెందిన లేక్ ప్రొటెక్షన్ సెల్ అధికారులతో సమావేశమయ్యారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో నిర్మించే ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. చెరువుల్లో బండరాళ్లు, మట్టి నింపే వారిని గుర్తించి వాహనాలను సీజ్ చేయాలని సూచించారు. చెత్త, వ్యర్థాలను చెరువుల్లో పడేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు చిన్నారెడ్డి, విజయ్‌కుమార్, ఉమాదేవి, శ్రీకాంత్‌రెడ్డి, ఉపకమిషనర్లు, ఈఈలు, ఏఎంవోహెచ్‌లు పాల్గొన్నారు.

# మరమరాల పందిరిలో... రాములోరి కల్యాణం

● 39 ఏళ్లుగా ధర్మనిలయంలో ఉత్సవాలు



కొలువుదీరిన సీతారాములు

**సైదాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** సైదాబాద్, ఏపీఏయూ కాలనీలోని ధర్మనిలయంలో మరమరాలు... వేరుసెనగలతో తీర్చిదిద్దిన పందిరిలో 39 సంవత్సరాలుగా సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ శ్రీరామనవమి ఉత్సవాలు ఉగాది రోజున ప్రారంభమై నవమి రోజు కల్యాణంతో ముగుస్తాయి. రామాయణ ఇతిహాసం తెలియజేసే విధంగా ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఉత్సవాల్లో జరిగే నిత్యాన్నదానంలో వేలాదిమంది భక్తులు పాల్గొంటారు.

### 39 ఏళ్లుగా కొనసాగుతున్న ఆచారం

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీప గ్రామం నుంచి వచ్చిన సూర్యనారాయణరాజు కుటుంబం తమ ఇంట్లోనే ధర్మనిలయం పేరిట రామాలయాన్ని ఏర్పాటు చేశారు. 39 ఏళ్లుగా ఆలయంలో మరమరాలతో పందిరి వేసి కల్యాణం నిర్వహిస్తున్నారు. ఎనిమిదేళ్ల క్రితం సూర్యనారాయణ రాజు మృతి చెందగా ఆయన సతీమణి కుటుంబసభ్యులతో కలిసి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ జరిగే ఉత్సవాలకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఉత్సవాల్లో భాగంగా రామకోటి జపం, విష్ణుసహస్ర నామాలు, నగర సంకీర్తన, భజనలు, హోమాలు, నిత్యాన్నదానం ఉంటాయి.

### 2 బస్తాల మరమరాలు, వేరుశెనగలు...

మాఘ శుద్ధ పంచమి రోజున గ్రామదేవతకు చలిమిడి, పాలతో అభిషేకించి పందిరి పనులకు శ్రీకారం చుడతారు. మరమరాల ముత్యాల పందిరి అలంకరణను ఉగాది రోజున ప్రారంభిస్తారు. సుమారు 40 మంది మహిళలు రోజూ దారాలకు మరమరాలు ఎక్కిస్తారు. 60కిలోల మరమరాలు, 40 కిలోల వేరుశెనగలను అలంకరణకు వినియోగిస్తారు. రామనామ జపం చేస్తూ మహిళలు ఆధ్యాత్మిక వాతావరణంలో అల్లికలను సాగిస్తారు.

### రాముడి ఆదేశంతోనే సేవ...



చిన్నప్పటి నుంచి రాముడి భక్తురాలిని. రాముడి ఆదేశంతో మేమంతా 39 ఏళ్లుగా మరమరాల పందిరిలో నిరాటంకంగా శ్రీరామ కల్యాణం జరిపిస్తున్నాం. మరమరాల ముత్యాల పందిరి అలంకరణను ఉగాది రోజున మొదలు పెడతాం. 40 మంది భక్తులు మరమరాల హారాలు అల్లుతారు. ఇద్దరు కుమారులు, కోడళ్ల సహకారంతో యజ్ఞం నిరాటంకంగా కొనసాగిస్తున్నా. నా తదనంతరం కుటుంబసభ్యులు సంప్రదాయాన్ని కొనసాగిస్తారని నమ్ముతున్నా

-నిర్వాహకురాలు అనసూయమ్మ

### మరా...మరా... రామ.

రామ జపానికి మూలం మర అనే భావనతో సీతారాముల కల్యాణానికి మరమరాలు ఏర్పాటుచేశారు. పదకొండు మరమరాల చొప్పున తయారు చేసే దండలో ఓ పల్లీగింజ (వేరుశెనగ) చేరుస్తారు. సీతాదేవి భూగర్భంలో అవతరించిందనే పౌరాణిక గాథను అనుసరించి భూమి నుంచి వచ్చే వేరుశెనగకు మరమరాల దండల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నారు. దశేంద్రియాల తర్వాత ఏకాదవ ఇంద్రియానికి ప్రత్యేక స్థానం కల్పించే ఉద్దేశంతోనే పదకొండు సంఖ్యను ఎన్నుకున్నారు.

## శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైన ఆలయం

**రాయదుర్గం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** గచ్చిబౌలి టెలికాంనగర్ సాయిదత్త గణపతి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ధర్మగారి రవీందర్‌రెడ్డి తెలిపారు. 17వ తేదీ ఉదయం 6 గంటలకు బాబావారికి కాగడ హారతి, 7 గంటలకు గణపతి దత్తాత్రేయ, సాయిబాబా వారి క్షీరాభిషేకం, సాయి అష్టోత్తరములు, విష్ణుసహస్రనామము, లక్ష్మీ అష్టోత్తరము, సాయిసహస్రనామం, మధ్యాహ్న హారతి, సంధ్యాహారతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విగ్రహ పతిష్ఠలో పాల్గొన్న భక్తులు

## సాయిబాబా, దత్తాత్రేయుల విగ్రహ ప్రతిష్ఠ

**అల్లాపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** అల్లాపూర్ డివిజన్ తులసి నగర్ కనకదుర్గా, అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ ప్రాంగణంలో కొత్తగా సాయిబాబా, దత్తాత్రేయ దేవతల విగ్రహ ప్రతిష్ఠ క్రతువును భక్తులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గట్టు రంగాచార్యులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

**జేఎన్‌టీయూ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం కూకట్‌పల్లి అగ్నిమాపక శాఖ సిబ్బంది హైదర్‌నగర్ ఆర్టీసీ బస్టాప్, నిజాంపేట్ క్రాస్ రోడ్డులోని జీపీఆర్ మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోకుండా జరిగే అగ్నిప్రమాదాల నుంచి ఎలా బయటపడాలనే దానిపై ప్రయాణికులకు, థియేటర్ సిబ్బందికి అవగాహన కల్పించారు.



జలమండలి అధికారికి వినతిపత్రం ఇస్తున్న కేపీహెచ్‌బీ కాలనీవాసులు

## తాగునీటి సరఫరా సమయాన్ని పెంచండి

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** కేపీహెచ్‌బీకాలనీలోని ఫేజ్ 1, 2 ప్రాంతాలలో తాగునీటి సరఫరా సమయాన్ని పెంచాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ సభ్యులు సోమవారం జలమండలి జీఎం ప్రభాకర్ రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు లక్ష్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో కీలక ఘట్టం

## వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

**వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** వివేకానందనగర్‌కాలనీలోని శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన శ్రీవారు, అమ్మవార్ల శాంతి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహనంపై ఊరేగింపు చేపట్టారు. ఆయా పూజాకార్యక్రమాల్లో ఎమ్మెల్యే గాంధీతోపాటు వందలమంది భక్తులు పాల్గొన్నారు.

## కేంద్రాన్ని ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐ దాడులు

**పంజాగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలను ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐ దాడులు చేసి జైలుకు పంపుతున్నారని ప్రముఖ ఆర్థిక ,రాజకీయ, సామాజిక విశ్లేషకులు డి.పాపారావు అన్నారు. ప్రతిపక్ష నాయకులను ఎన్నికల సందర్భంగా జైల్లో పెట్టడం అంటే వారిని పోటీలో లేకుండా చేసి గెలిచేందుకే చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మధురానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవ తెలంగాణ బుక్ హౌస్ ప్రచురించిన ప్రబీర్ పుర్కాయస్థ పుస్తకాన్ని ఆయన కామ్రేడ్ జితిన్,నవ తెలంగాణ బుక్ హౌస్ మేనేజర్ వాసుతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ న్యూస్ క్లిక్ యూట్యూబ్ చానల్ ద్వారా ప్రజా, కార్మిక సమస్యలు ప్రజలందరికీ తెలియజేసినటువంటి గొప్ప పోరాట యోధుడు ప్రబీర్ అన్నారు. ఆయన రచించిన అలుపెరుగని పోరాటం నాటి ఎమర్జెన్సీ నుంచి నేటి మోదీ ప్రభుత్వం అనుసరించే అప్రకటిత ఎమర్జెన్సీ వరకు వివిధ అంశాలను పుస్తకంలో వివరించాడన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలు, వాటిని ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐ దాడులు చేసి జైలుకు పంపుతున్నారన్నారు. దేశంలో మీడియా మొత్తం ఆర్ఎస్ఎస్, బీజేపీ చేతిలో ఉందనన్నారు. కార్యక్రమంలో ప్రబీర్ సహచరులు అంబ్కేర్, సృజన, సీపీఎం నాయకులు చంద్రశేఖర్ రావు, అశోక్, స్వామి, భిక్షపతి, హనుమంతురావు, పాపారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** పేట్‌బషీరాబాద్, మేడ్చల్ ఆర్‌టీఏ కార్యాలయంలో డీటీఓ రఘునందన్ రావు సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీరే కదా అని చులకనగా తీసుకుంటే రాబోయే తరానికి మనుగడ కష్టం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోపి, మేడ్చల్ ఆర్‌టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఆర్‌ఫౌండేషన్‌లో కంకణాల వసుమతి వర్ధంతి

**మియాపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** కొండాపూర్‌లోని సీఆర్‌ఫౌండేషన్‌లో ఫౌండేషన్ జనరల్‌బాడీ, మహిళా సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యురాలు, సీఆర్‌ఫౌండేషన్ అధ్యక్షుడు కె.నారాయణ సతీమణి కంకణాల వసుమతి ద్వితీయ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.రజిని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో కరెంట్ లేకపోవడంతో చీకట్లోనే పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు

## ప్రభుత్వ పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**బోయినపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో కరెంట్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లోనే పరీక్షలు రాస్తున్నారు. పాఠశాలకు కరెంట్ నిలిపివేసి ఐదురోజులైనా ప్రిన్సిపాల్ స్పందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. స్థానిక నాయకులు కొందరు ఎంఈవోకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో విద్యుత్‌ను పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఎస్సీ వర్గీకరణపై సీఎంకు స్పష్టత లేదు

● మందకృష్ణ మాదిగ

**బోయిన్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** ఎస్‌సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా లేరని, ఎస్‌సీ రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, మాదిగలకు నామినేటెడ్ పదవి ఇస్తామనడం హాస్యాస్పదమని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈమేరకు సికింద్రాబాద్‌లోని లీప్యాలెస్‌లో కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకుడు కిషన్ మాదిగ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మాదిగ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎస్‌సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ, కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో మాదిగలకు టిక్కెటు కేటాయించకుండా అన్యాయం చేశారని అన్నారు. ఓటు రూపంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆ పార్టీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎస్‌సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో స్పష్టంగా లేరని అన్నారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎస్‌సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేకి అని, అందుకే పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేకుండా చేసిందే కాంగ్రెస్ అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అజిత్, శ్రీకాంత్, పరశురాం, ఇటుక శ్రీకిషన్, రొట్టెల సునీల్, మధుకర్, నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.



రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న సీఐ క్రాంతికుమార్

## రౌడీషీటర్లు లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉండాలి

**జీడిమెట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** రౌడీషీటర్లు లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉండాలని, ఎలాంటి అరాచకాలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ హెచ్చరించారు. సోమవారం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారితో మాట్లాడారు. ఇప్పటికీ కొందరు రౌడీషీటర్లు గాజులరామారం, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో భూకబ్జాలకు పాల్పడుతున్నట్టు సమాచారం ఉందని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

## అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఎలక్ట్రిక్ వాహనాలు

**నార్సింగ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** నార్సింగ్ కేంద్రీకృత వంటశాల ఆధునీకరణకు జెమిని ఎడిబుల్స్ సంస్థ మూడు ఎలక్ట్రిక్ వాహనాలను సోమవారం అందజేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెమిని ఎడిబుల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు, ట్రస్టీ సత్యగౌర చంద్రదాసు హాజరై ఎలక్ట్రిక్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యగౌర చంద్రదాసు మాట్లాడుతూ.. నార్సింగ్‌లో వంటశాలను అధునీకరించడమన్నది మా లక్ష్యసాధనలో మరో ముఖ్యమైన ముందడుగు అని అన్నారు. ఈ వ్యూహాత్మక పునర్నిర్మాణం 37,000మందికి రోజూ వండే ప్రస్తుత వంటశాల సామర్థ్యాన్ని 50వేలకు పెంచుతున్నదని పేర్కొన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ భారతదేశంలోని 16 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 72 వంటశాలల ద్వారా 24,082 పాఠశాలల్లోని 20లక్షల మంది పిల్లలకు ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్‌జీవో సంస్థ నిర్వహించే పాఠశాల భోజన కార్యక్రమంగా నిలిచిందని ఆయన ఆనందం వ్యక్తంచేశారు. అనంతరం అక్షయపాత్ర ఫౌండేషన్ సీఈవో శ్రీధర్ వెంకట్ మాట్లాడుతూ జెమిని ఎడిబుల్స్ సంస్థ అందించిన ఈ సహకారాన్ని ఎన్నడూ మరవలేమన్న ఆయన, జెమిని ఎడిబుల్స్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జెమిని ఎడిబుల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. అక్షయపాత్ర వాళ్లు చేస్తున్న సేవలు ఎప్పటికి మరువలేమని కొనియాడారు. అక్షయపాత్ర ఫౌండేషన్‌కు తమవంతు సహకారమందించడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

## హెచ్ఏఎల్ కాలనీలో వీధి కుక్కల స్వైర విహారం

**గాజులరామారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):** వీధి కుక్కలతో జనం భయాందోళనకు గురవుతున్నారు. బస్తీలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ రోడ్డుపై రాకపోకలు సాగించే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీ, కమాన్ 6వ వీధిలో పాలప్యాకెట్‌కు అని వెళ్లిన రత్నదాస్ (55)పై ఒక్క సారిగా కుక్కల గుంపు దాడి చేసి మోకాలి భాగంలో గాయపరిచాయి. సంబంధిత అధికారులు స్పందించి కాలనీల్లో తిరుగుతున్న వీధి కుక్కలను పట్టుకొని వెళ్లాలని స్థానికులు కోరుతున్నారు.